

పాల వెల్లువ!

ఘనీకృత పశువీర్య ఉత్పత్తి కేంద్రానికి నిధులు

పాల ఉత్పత్తి.. ఆరోగ్యకరమైన, దృఢమైన సంకర జాతి పశు సంపదను పెంపొందించడంలో ప్రధాన భూమిక పోషించే ఘనీకృత పశువీర్య ఉత్పత్తి కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. షాద్‌నగర్ నియోజకవర్గం కంసాన్‌పల్లి గ్రామంలో అర్ధంతరంగా ఆగిపోయిన ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం బుధవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఈ కేంద్రం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే పాడి రైతుల కష్టాలు తీరడంతోపాటు పాల ఉత్పత్తి కూడా పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- బడ్జెట్‌లో రూ. 21.6 కోట్లు కేటాయింపు
- అసెంబ్లీలో వెల్లడించిన ఆర్థికమంత్రి భట్టి
- హర్షం వ్యక్తం చేస్తున్న పాడి రైతులు
- అందుబాటులోకి వస్తే పాల ఉత్పత్తి రెట్టింపు
- ఫలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి కృషి


కంసాన్‌పల్లిలోని ఘనీకృత పశు వీర్య ఉత్పత్తి కేంద్రం

షాద్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) సుదీర్ఘవిరామం తర్వాత ఎట్టకేలకు ఘనీకృత పశు వీర్య ఉత్పత్తి కేంద్రానికి మోక్షం లభించింది. అరకొరగా ఉన్న ఈ కేంద్రాన్ని సంపూర్ణంగా వృద్ధిలోకి తేవాలని సర్కార్ సంకల్పించింది. ఇందుకోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.21.6 కోట్ల నిధులు కేటాయించింది. దీని ద్వారా సంవత్సరానికి సుమారు 10లక్షల ఫ్రోజెన్ సెమన్ డోసుల ఉత్పత్తి సామర్థ్యం ఏర్పడుతుంది. అందుకే ఈ కేంద్రాన్ని పునరుద్ధరిస్తున్నట్లు 2025-2026 అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క నిధుల కేటాయింపు విషయాన్ని వెల్లడించారు. దీంతో పాడిరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది పూర్తయి అందుబాటులోకి వస్తే పాడి రైతుల కష్టాలు తీరడంతో పాటు, పాల ఉత్పత్తి మరింత పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దశాబ్ద కాలంగా వృథాగా ఉన్న ఈ ఘనీకృత పశు వీర్య ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించడానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన కృషిని పాడి రైతులు అభినందిస్తున్నారు. సత్వరమే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. తెలంగాణలో పాల ఉత్పత్తిని పెంచడానికి గత ప్రభుత్వం 2016లో రంగారెడ్డి జిల్లా కంసాన్‌పల్లి గ్రామంలో సుమారు 23 ఎకరాల్లో రూ.16 కోట్లతో ఘనీకృత పశు వీర్య ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించింది. దీనికి అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేసిన మిగతా 8వ పేజీలో...

భారీగా తగ్గనున్న ఖర్చు

ప్రస్తుతం పాడి రైతులు లక్షల రూపాయలు వెచ్చించి బెంగళూరు, ఏపీలోని పుంగనూరు, పోలవరం, కోయంబత్తూరు లాంటి అంతర్రాష్ట్రాల నుంచి పాడి ఆవులు, గేదెలను కొనుగోలు చేస్తున్నారు. అవి రోజుకు కేవలం 10లీటర్ల పాలను మాత్రమే ఇస్తాయి. కానీ ఘనీకృత పశు వీర్య ఉత్పత్తి కేంద్రం నుంచి వచ్చిన పాడి ఆవులు, గేదెలు రోజుకు 20లీటర్లకు పైగా పాలు ఇస్తాయని పాడి రైతులు తెలిపారు. అంతేకాకుండా పాలు శ్రేష్ఠకరంగా ఉంటాయని, ధర కూడా ఎక్కువ పలుకుతుందన్నారు. ప్రస్తుతం విజయ డెయిరీ రోజుకు 2.80లక్షల లీటర్లను పాలను సేకరిస్తుందని, పశు వీర్య ఉత్పత్తి కేంద్రం అందుబాటులోకి వస్తే ఈ సంఖ్య రెండింతలు అవుతుందని పాడి రైతులు అభిప్రాయపడుతున్నారు.

నిధులు కేటాయించడం శుభసూచకం



కంసాన్‌పల్లిలోని పశు వీర్య ఉత్పత్తి కేంద్రం అభివృద్ధికి రూ.21కోట్లు కేటాయించడం శుభసూచకం. దీనివల్ల పాడి రైతులకు ఎంతోమేలు జరుగుతుంది. ఇతర రాష్ట్రాలకు వెళ్లి లక్షల రూపాయలు వెచ్చించి పాడి ఆవులు, గేదెలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. పాల ఉత్పత్తి కూడా అధికంగా ఉంటుంది. వెంటనే పనులు ప్రారంభించి కేంద్రాన్ని ఉపయోగంలోకి తేవాలి.


- కావలి మల్లేష్, పాడి రైతు

త్వరలో అందుబాటులోకి..



ప్రభుత్వం కేటాయించిన నిధులతో పశు వీర్య ఉత్పత్తి కేంద్రాన్ని త్వరలోనే అందుబాటులోకి తెస్తాం. పాడి రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాను. నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు. ఏ రైతు కూడా ఇబ్బందులు పడొద్దనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే



పకడ్బందీగా పది పరీక్షలు

జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రంగారెడ్డి అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నేటి (శుక్రవారం) నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో సుశీందర్‌రావు తెలిపారు. విద్యార్థులను పరీక్షలకు అన్నివిధాలా సిద్ధం చేశామని, ఒత్తిడికి గురికాకుండా నిపుణులతో కెరియర్ గైడెన్స్ ఇప్పించామన్నారు. పరీక్షల కోసం 249 కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ప్రశ్న పత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరాయని... సీఎస్, డీవోలకు శిక్షణ ఇచ్చామని బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో డీఈవో వివరించారు.

ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు?

జిల్లాలో 249 కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కలుపుకొని మొత్తం 51,794 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. 22 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

పరీక్ష కేంద్రానికి విద్యార్థులు ఏం తీసుకురావాలి?

హాల్‌టికెట్ తప్పనిసరి వెంట తెచ్చుకోవాలి. అందులో ఏమైనా పొరపాట్లు ఉంటే వెంటనే పాఠశాల అధికారులను సంప్రదించాలి. నీలం, నల్ల బాల్ పాయింట్ పెన్నుతో మాత్రమే రాయాలి. జెల్ పెన్ను, రంగుపెన్నులను వాడొద్దు. వైట్ ఇంక్, కరెక్షన్ ఫ్లూయిడ్స్ ఉపయోగించడం నిషేధం. అవసరమైన పెన్ను, పెన్సిల్, రబ్బరు, జామెట్రీ బాక్స్, పారదర్శక పౌచ్‌లో మాత్రమే తీసుకురావాలి. ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావొద్దు.

పరీక్ష విధానం ఎలా ఉంటుంది?

విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్ ఇవ్వడం జరుగుతుంది. భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పత్రాల కోసం 12 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. విద్యార్థులు ఈ బుక్‌లెట్‌లోనే సమాధానాలు పూర్తి చేయాలి.

నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదన్న నిబంధన ఉందా?

విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. నిమిషం ఆలస్యమైతే అనుమతించరన్న నిబంధన ఏమీ లేదు. ఉదయం 9.35 గంటల వరకు పరీక్ష హాలులోకి ప్రవేశించడానికి అనుమతి ఇస్తారు.

సెంటర్ల వద్ద ఎలాంటి సౌకర్యాలు కల్పించారు?

పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, వైద్యం, విద్యుత్ సౌకర్యాలు కల్పించాం. విద్యార్థులు కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు అదనంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

విద్యార్థుల తల్లిదండ్రులకు మీరిచ్చే సూచనలేమిటి?

పరీక్షల వేళ విద్యార్థులు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. ఒత్తిడి పెరిగేలా ప్రవర్తించకండి. విద్యార్థులు కనీసం 7-8 గంటలు నిద్రపోయేలా చూడండి. పోషకాలతో కూడిన ఆహారం అందివ్వండి. కెఫిన్ ఉన్న పానీయాలను ఇవ్వొద్దు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఇంటిబాట పట్టిన విద్యార్థులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈనెల 5న ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాగా సెకండియర్ పరీక్ష 6వ తేదీన ప్రారంభమయ్యాయి. ఫస్టియర్ పరీక్షలు ఈనెల 18న ముగియగా సెకండియర్ పరీక్షలు 19న గురువారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 1,58,804 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అందులో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 50,409 మంది, సెకండియర్ పరీక్షలకు 78,395 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 185 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. చివరి రోజు 72,033 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 69,894 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఒకరికొకరు బైబై, టాటా చెప్పుకుంటూ ఇంటిబాట పట్టారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు బ్యాగులు, పెట్టెలు సర్దుకొని తల్లిదండ్రుల వెంట సొంతఊర్లకు ప్రయాణమయ్యారు. దీంతో బస్టాండ్‌లు కిక్కిరిశాయి.



సర్వం సిద్ధం

నేటి నుంచి టెన్త్ ఎగ్జామ్స్.. » 249 సెంటర్లు.. 51,794 మంది విద్యార్థులు


మొయినాబాద్ రూరల్ : అజీజ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

రంగారెడ్డి అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నేటి (శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఎగ్జామ్స్ కోసం విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 249 పరీక్ష కేంద్రాల్లో 51,794 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒక్క సైన్స్ పరీక్షలు తప్ప మిగిలినవి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతాయి. సైన్స్ సబ్జెక్టును భౌతిక, రసాయన శాస్త్రాలుగా విభజించి వాటి పరీక్షలు వేర్వేరు రోజుల్లో నిర్వహించాలని నిర్ణయించారు. ఆ రెండు పరీక్షలు మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు జరుగుతాయి. ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీతో ముగుస్తాయి. 3, 4 తేదీల్లో ఓరియంటల్ సబ్జెక్టుల పరీక్షలు జరుగుతాయి. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 249 మంది సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశారు. 22 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను ఏర్పాటు చేశారు.

భూసేకరణపై రగడ!

భగ్గుమంటున్న యాచారం మండల రైతులు

- వ్యవసాయ భూముల జోలికి రావొద్దని వినతి
- ప్రాణాలు పోయినా భూములిచ్చేది లేదని స్పష్టం
- ఏ పోరాటానికైనా సిద్ధమంటున్న అన్నదాతలు


రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

యాచారం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మారడం లేదని యాచారం మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న భూముల్లో పాలకులు ఎకరం కూడా వదిలేలా కనపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసపెట్టి ఈ మండలంలో భూసేకరణ చేయడంపై అన్నదాతలు భగ్గుమంటున్నారు. జీవనాధారమైన వ్యవసాయ భూములను పరిశ్రమలు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం అంటూ లాక్కుంటే మా కుటుంబాలు బతికేదెలా అని మండిపడుతున్నారు. ప్రాణాలైనా ఇస్తాం కానీ మా భూములు ఇవ్వమని ఆందోళన బాట పట్టారు. పరిశ్రమలు వద్దు... వ్యవసాయమే ముద్దు అని నినదిస్తున్నారు. మా భూముల జోలికి రావొద్దని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నారు. భూసేకరణను ఆపకుంటే ఉద్యమించడానికైనా సిద్ధమంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ నిర్మాణమంటూ ఈ మండలంలో వేల ఎకరాల భూములను సేకరించింది. దీనికి అరకొర పరిహారం రైతులకు చెల్లించి చేతులు దులుపుకుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ కోసం తీసుకున్న భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని, మళ్లీ ఇక్కడ ఏ కంపెనీ కోసం భూసేకరణ చేపట్టబోమని కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడవకముందే కాంగ్రెస్ ప్రభుత్వం యాచారం మండలంలో భూసేకరణకు పూనుకుంది. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసమని యాచారం మండలంలో మిగతా 8వ పేజీలో...

పారిశ్రామిక పార్క్ కోసం భూములు తీసుకోవద్దు

కోదండరెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలకు రైతుల వినతి 8

మొయినాబాద్ మున్సిపాలిటీలోకి అప్పోజిగూడ

మొయినాబాద్ రూరల్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పోజిగూడ గ్రామం సైతం ఇటీవల నూతనంగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీలో విలీనమైంది. ఈ విషయం ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎన్కేపల్లి, సురంగల్, మొయినాబాద్, చిలుకూరు, పెద్దమంగళారం, ముర్తుజగూడ గ్రామాలు మొయినాబాద్ మున్సిపాలిటీలో ఉన్నాయి. తాజాగా అప్పోజిగూడను కూడా చేర్చారు. దీంతో మున్సిపాలిటీలోని గ్రామాల సంఖ్య 9కి చేరింది. ఈ సందర్భంగా అప్పోజిగూడ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో కలపడం ద్వారా గ్రామం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వాటర్ ట్యాంక్ పనులకు మోక్షం

- కూలిన స్లాబ్‌కు మరమ్మతులు


8


ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఎన్నికల ఖర్చు వివరాలను వెంటనే అందించాలి

» అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి జిల్లా అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల్లో పోటీ చేసి ఖర్చుల లెక్కలు తెలపని అభ్యర్థులు వెంటనే వివరాలు అందజేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్‌వో సంగీతతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసి లెక్కలు అందించని అభ్యర్థులపై ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అలాగే తెలంగాణ సీఈవో సూచనల మేరకు అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ కేంద్రాలు, వాటికి సంబంధించిన బూత్ లెవల్ ఆఫీసర్ల వివరాలను వెల్లడించారు. జిల్లా పరిధిలోని ఎల్‌బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, షాద్‌నగర్, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో 1065, పట్టణ ప్రాంతాల్లో 2436 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. ఈ పోలింగ్ కేంద్రాలలో మొత్తంగా 3501 బూత్‌లెవల్ పోలింగ్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఈ ఎనిమిది నియోజకవర్గాల్లో 36,75,050 ఓటర్లు ఉండగా, ఇందులో ఈనెల 20 నాటికి 1889115లక్షల మంది పురుషులు, 1785501 మంది మహిళలు, 434 మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న ఫాం 6,7, 8 త్వరగా క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధి కూలి రూ.600 ఇవ్వాలి

కందుకూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని, ఏడాదికి 200రోజుల పనికల్పించాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి జగన్, అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. గురువారం నాయకులు ఎ.కుమార్, బి.శ్రీనివాస్‌లతో కలిసి నేదునూరులో పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. ఈ ప్రాంతంలో పంటల సాగు తగ్గుతున్న నేపథ్యంలో ఉపాధి పనిదినాల సంఖ్యను పెంచాలన్నారు. కూలీలకు పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. 'ఆత్మీయ భరోసా'కు ఉపాధి హామీ లింక్‌ను తీసేయాలని డిమాండ్ చేశారు.



పది పరీక్ష.. కంపచెట్లే రక్ష!

పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా కిటికీలకు తలుపులు లేకపోవడంతో నకల్ చిట్టీలు అందించకుండా ముళ్ల కంపలను అడ్డుగా ఉంచారు. షాద్‌నగర్ మండలం ఫరూఖ్‌నగర్ పాఠశాలలో శుక్రవారం(నేటి) నుంచి పది పరీక్షలు జరగనున్నాయి. దాంతో మాస్ కాపీయింగ్ జరగకుండా, అలాగే బయటి నుంచి ఎవరి సహకారం అందకుండా చేసేలా కంపచెట్లను కిటికీలకు అడ్డుగా ఉంచారు. దీంతో స్థానికులు దృశ్యాన్ని ఫోన్‌లో బంధిస్తున్నారు.

- షాద్‌నగర్ రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి)



రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మహేందర్

ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరేద్దాం

శంషాబాద్ రూరల్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ జెండాను ఎగరేద్దామని రంగారెడ్డి రూరల్ జిల్లా నూతన అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. గురువారం తన గెస్ట్‌హౌజ్‌లో కార్యకర్తలు ఏర్పాటు చేసిన సన్మాన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలని చెప్పి పీఠమెక్కిన కాంగ్రెస్ పాలకులు ఒక్క హామీనైనా పూర్తిగా అమలు చేయలేదన్నారు. బీజేపీకి జిల్లాలో పూర్వవైభవం తెద్దామని రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. కలిసికట్టుగా పార్టీ కోసం కృషిచేద్దామని కోరారు. తాను కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. అంతకు ముందు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం, రాజేంద్రనగర్ బీజేపీ కన్వీనర్ మల్లేశ్, చేవెళ్ల పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జి మల్లారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రొటోకాల్ జాయింట్ కన్వీనర్ యాదగిరి, అనంతయ్యగౌడ్, యాదగిరి, విజయ్, మురళి తదితర నాయకులు రాజ్‌భూపాల్‌గౌడ్‌కు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి'

కేశంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌లో ముదిరాజ్‌లకు బీసీ-ఏలో చెర్చుతామని ప్రకటించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆ హామీని అమలు చేయాలని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అల్లాదుర్గం సురేష్ డిమాండ్ చేశారు. గురువారం కేశంపేటలో ముదిరాజ్‌ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు బీసీ-ఏలో చేర్చి రిజర్వేషన్ పెంచాలని కోరారు. రిజర్వేషన్ పెరిగితేనే ముదిరాజ్‌లకు న్యాయమైన వాటా దక్కుతుందని తెలిపారు. ఇందుకు అన్ని పార్టీల నాయకులు ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కన్వీనర్ నారాయణ, జిల్లా యూత్ వింగ్ కన్వీనర్ శ్రీనివాస్, గోపాల్, జంగయ్య, చంద్రయ్య, యాదయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి' అమలుతో ఆర్టీసీకి పెరిగిన ఆదరణ



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి,మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి ఆదరణ పెరిగిందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్టీసీ డిపోకు కొత్తగా వచ్చిన ఐదు బస్సులను ఆయన ప్రారంభించారు. రెండు మహబూబ్‌నగర్, రెండు షాద్‌నగర్, ఒకటి హైదారబాద్ రూట్‌లో వెళ్తాయని చెప్పారు. వాటికి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆర్టీసీ లాభాల దిశగా పయనిస్తోందన్నారు. రోజూ రాష్ట్రంలో బస్సుల్లో 50లక్షలకుపైగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. రూ.60లక్షలతో పరిగి బస్‌స్టేషన్‌ను ఆధునీకీకరిస్తున్నామని తెలిపారు. డిపోకు కొత్తగా 17 బస్సులొచ్చాయన్నారు. పరిగిలోని కొత్త చెరువు పునర్నిర్మాణంతో మినీ ట్యాంకుబండ్‌గా రూపుదిద్దుతామన్నారు. పరిగి-లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులకు త్వరలోనే సీఎం శంకుస్థాపన చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పార్థసారథి, బి.పరశురాంరెడ్డి, ఆంజనేయులు, ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కె.హన్మంత్, ఇ.కృష్ణ, ఆనందం. బి.భీంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, భరత్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

ధారూరు, మార్చి20(ఆంధ్రజ్యోతి):పాత కక్షలతో దంపతులను హత్య చేసి, మరొకరిపై హత్యాయత్నం చేసిన కేసులో ఐదుగురికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ వికారాబాద్ కోర్టు గురువారం తీర్పునిచ్చిందని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ధారూరు మండలం నాగసమందర్‌కు చెందిన చౌట మల్లేశం తన తల్లితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని చౌట వెంకటేశం.. మల్లేశాన్ని హతమర్చాడు. దీంతో మల్లేశం కుటుంబీకులు వెంకటేశం కుటుంబంపై కక్షపెంచుకున్నారు. 2012న డిసెంబరు 24న చౌట బందెప్ప మరో ఆరుగురితో కలిసి మారణాయుధాలతో చౌట బాలప్ప ఇంట్లోకి చొరబడి దాడిచేశారు. దీంతో బాలప్ప తల్లిదండ్రులు చిన్న నర్సింహులు, అంజమ్మ మృతిచెందారు. బాలప్ప అక్క బాలమణి అడ్డు వెళ్లగా ఆమెపైనా దాడిచేశాడు. ఈ ప్రతీకార హత్య కేసును అప్పటి ఎస్‌హెచ్‌వో ఎం.రమేశ్ నిందితులపై కేసులు నమోదు చేశారు. విచారణాధికారులు లచ్చీరామ్, విజయ్‌లాల్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వివరాలను పరిశీలించిన జిల్లా సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి తీర్పు ఇచ్చారు. నిందితులు చౌటలక్ష్మి, కుర్వ గోపాల్, కుర్వ అంజయ్య, చౌట పెంటమ్మ, కుర్వ లక్ష్మిలకు జీవిత ఖైదు, రూ.2వేలా జరిమానా విధించారు. బాలమణిపై హత్యాయత్నానికి పాల్పడినందుకు నిందితులకు పదేళ్ల కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. కేసును పకడ్బందీగా విచారణ చేసి నిందితులకు శిక్ష పడేలా పనిచేసిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు. ఇదిలా ఉంటే కేసు నిందితుడు ఉన్న బందెప్ప అనారోగ్యంతో ఇప్పటికే మృతిచెందాడు.

ఉపన్యాస పోటీల్లో ఐదోస్థానం



తాండూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ ఎడ్యుకేషన్ పోటీలను నిర్వహించారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అంశంపై తాండూరు సింధూడిగ్రీ కాలేజీ బీఎస్సీ-ఎంపీసీ ఫైనలియర్ విద్యార్థిని ఆర్.శివలీల ఐదోస్థానంలో నిలిచింది.

ఆమనగల్లు మున్సిపాలిటీ

తైబజార్ @ రూ.34లక్షలు

- బల్దియాకు భారీగా ఆదాయం

ఆమనగల్లు, మార్చి20(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం తైబజార్ వేలం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి కమిషనర్ శంకర్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన వేలంలో 31మంది డిపాజిటర్లు పాల్గొన్నారు. వేలంలో గతేడాది రూ.13.05లక్షల ఆదాయం ఎక్కువొచ్చింది. ఈ ఏడాది తైబజార్ వేలం మినిమం ప్రైజ్ రూ.14.90లక్షలను నిర్దేశించారు. లక్ష్యానికి మించి ఆదాయం లభించింది. ఆమనగల్లుకు చెందిన జెన్నెల గిరియాదవ్, నాగిళ్ల జగన్ వేలంలో చివరివరకు పోటీపడ్డారు. రూ.34లక్షలకు గిరియాదవ్ వేలాన్ని దక్కించుకున్నారు. మున్సిపాలిటీకి గతం కంటే రూ.26.95లక్షలు ఎక్కువ ఆదాయం సమకూరనుంది. వేలంలో సిండికేట్ వ్యూహం ఫలించలేదు. అలాగే చికెన్ వ్యర్థాల వేలాన్ని రూ.4.1లక్షలకు మానుపాటి నర్సింహ దక్కించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ దామోదర్, రామకృష్ణ, నాయకులు, టెండర్‌దారులు పాల్గొన్నారు.

బోధనపై నిర్లక్ష్యం

- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు
- నష్టపోతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



విద్యార్థులను తరగతి గదిలో కూర్చోబెట్టిన స్కావెంజర్ రామాంజమ్మ

చౌదరిగూడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర ప్రాథమిక పాఠశాలలో టీచర్లు సమయపాలన పాటించడంలేదు. గురువారం ఉదయం ఒంటిపూట ఉదయం 7:50 నుంచి 12:30 వరకే స్కూలు ఉన్నా ఉపాధ్యాయులు సమయానికి రాలేదు. ఈ పాఠశాలలో 63 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులున్నారు. ప్రార్థన సమయానికి ఇద్దరే టీచర్లు వచ్చారు. నలుగురిలో ఒకరు డిప్యూటేషన్‌పై రావిర్యాల పాఠశాలకు వెళ్లారని తెలిసింది. ఇక హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి టైంకు రాలేదు. ప్రార్థన అనంతరం కొందరు పిల్లలు ఊరికే తరగతి గదిలో కూర్చోగా.. 1 ,2, 3 తరగతుల విద్యార్థులను స్కావెంజర్ రామాంజమ్మ మరో గదిలో కూర్చోబెట్టారు. ఈ పరిస్థితి రోజూ ఉంటోందని విద్యార్థులు, వారి తల్లితండ్రులు తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యాబోధన బాగా చేస్తున్నామని టీచర్లు, ప్రభుత్వం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిల్లో కొన్నిచోట్ల ఇలాంటి పరిస్థితి ఉంది. వేలల్లో జీతాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు వారి వృత్తికి న్యాయం చేయాలని గ్రామస్థులు అంటున్నారు. ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు బాగా బోధిస్తేనే ఉన్నత తరగతుల్లో వారు మెరుగ్గా రాణిస్తారన్నారు. సమయపాలన పాటించని ఉప్యాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

అసైన్డ్ భూమిపై రియల్టర్ కన్ను

- అక్రమంగా కాంపౌండ్ వాల్ నిర్మాణం
- రెవెన్యూ అధికారుల చర్యలపై అనుమానాలు



తాండూరు-హైదరాబాద్ రోడ్డులో అసైన్డ్ భూమికి వేసిన కాంపౌండ్ వాల్

తాండూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తాండూరులో విలువైన ప్రభుత్వ/అసైన్డ్/వివాదాస్పద భూములపై రియల్టర్లు కన్నేస్తున్నారు. నాయకుల అండదండలు, రెవెన్యూ అధికారులు అవినీతితో భూములను కొల్లగొడుతున్నారు. పేదలకు పంచిన(అసైన్డ్)భూములు, వివాదంలో ఉన్న భములకు ఎంతోకొంత ముట్టజెప్పి స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటికే తాండూరులో వివాదాస్పద భూములు, పాట్లను సొంత చేసుకొని రియలెస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. తాజాగా తాండూరు-హైదరాబాద్ రోడ్డులోని ఖాంజాపూర్ గేటు సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న అసైన్డ్ భూమికి కాంపౌండ్ నిర్మించారు. యాలాల మండలం కోకట్ పరిధి సర్వే నంబర్ 64/40లో ఎకరానికిపైగా ఉన్న అసైన్డ్ భూమిపై రియల్టర్ల కన్ను పడింది. దానికి కాంపౌండ్ కట్టారు. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో మొదట రెవెన్యూ అధికారులు స్పందించినా చర్యలకు వెనకాడుతున్నారు. ఈ నెల 1న కాంపౌండ్ కూల్చేందుకు వచ్చిన అధికారులకు భూ యజమాని నాలుగురోజుల్లో కాంపౌండ్‌ను తొలగిస్తామని రాసివ్వడంతో అధికారులు వెనక్కి తగ్గారు. తర్వాత స్థల యజమాని ఈ నెల 24వ తేదీ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు నుంచి ఇన్‌జంక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నాడు. దీనిపై రెవెన్యూ అధికారులు కౌంటర్ దాఖలు చేయలేదు.

నిబంధనలు తుంగలో తొక్కి ...

అసైన్డ్ భూమి అమ్మేందుకు గానీ, వ్యవసాయేతర అవసరాలకు వాడుకునేందుకు గానీ అనుమతి లేదు. సాగుకోసమే ప్రభుత్వం పేదలకు భూమి పంచుతుంది. ఇక్కడ అధికారులు చర్యలకు పూనుకున్నా ఇప్పుడు మిన్నకుంటున్నారు. హైదరాబాద్ రోడ్డులోని భూములపై రియల్టర్ల కన్ను పడింది. అసైన్డ్ భూములను పట్టా చేసుకుంటూ ప్లాట్లుగా చేస్తున్నారు. గతంలో ఈ భూమిని ఖేల్ ఇండియా ఆటల నిర్వహణకు, ఆటోనగర్ కోసం కేటాయించారని స్థానికులు చెబుతున్నారు. ఆటోనగర్‌కు చెందిన కొందరు ఇది తమ స్థలమనీ అంటున్నారు. గతంలో ఇక్కడ పశువులషెడ్లు వేసేందుకు పంచాయతీ అనుమతికి ప్రయత్నాలు చేశారు.

పకడ్బందీగా కౌంటర్ దాఖలు చేస్తాం



అసైన్డ్ భూమి అన్యాక్రాంతం కాకుండా కోర్టులో కౌంటర్ దాఖలు చేస్తాం. రెండు రోజుల్లో కౌంటర్ వేసేందుకు పత్రాలను సేకరించాం. అసైన్డ్ భూమిలో నిర్మాణాలు చేపట్టొద్దు. హైదరాబాద్ రోడ్డు భూమిలో వేసిన కడీలను తొలగిస్తామని భూయజమాని రాసిచ్చినా తొలగించలేదు. ఆ కడీలను తీయకుంటే ప్రభుత్వం విధించే చర్యలకు ఒప్పుకుంటూ అతడు రాసిచ్చాడు. దీనిపై శాఖాపరంగా కోర్టులో అప్పీలు చేస్తాం.

- అంజయ్య, తహసీల్దార్, యాలాల



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న లక్ష్మారెడ్డి

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల కుటుంబాల్లో వెలుగులు

మహేశ్వరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదల కుటుంబాల్లో చిరుదీపాలు వెలుగుతున్నాయని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కె.లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రావిర్యాలకు చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేవారు. ప్రజల వైద్య ఖర్చులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఉపయోగపడుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రూ.1,000కోట్లకుపైగా విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిందన్నారు. సమసమాజ నిర్మాణంతోనే అభివృద్ధి సాధ్యం అని కేఎల్లార్ అన్నారు. అసెంబ్లీల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పెంపు, రాజీవ్ యువ వికాసం వంటి మూడు కార్యక్రమాలు చరిత్రలో నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, వైస్‌చైర్మన్ యాదయ్య, నాయకులు పాండురంగారెడ్డి, యాదయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి రజిత్‌కుమార్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- నిర్మాణంలోని కన్వెన్షన్ దగ్ధం.. రూ.6కోట్ల మేర నష్టం



శంషాబాద్ రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి ఈకేఏం కన్వెన్షన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తొండుపల్లికి చెందిన మహేశ్‌యాదవ్ తన పొలంలో ఈకేఏం పేరుతో కన్వెన్షన్ నిర్మిస్తున్నాడు. 90శాతం పనులు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 10 గంటల సమయంలో వర్కర్లు పనిచేస్తుండగా షార్ట్‌సర్క్యూటై మంటలు చెలరేగాయి. వెంటనే యాజమాని ఫైర్ స్టేషన్‌కు కాల్ చేశారు. అప్పటికే మంటలు వ్యాపించాయి. రెండు ఫైరింజన్లతో మంటలార్పారు. దాదాపు ఈ ప్రమాదంలో రూ.6కోట్ల నుంచి రూ.7కోట్ల ఆస్తినష్టం జరిగిందని మహేశ్ పోలీసులకు తెలిపారు. ఏప్రిల్‌లో కన్వెన్షన్‌ను ప్రారంభించాల్సి ఉందని అతడు ఆవేదన వ్యక్తం చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ నరేందర్‌రెడ్డి, ఎస్సై సర్దార్ పంచనమా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమీ లేదు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకిచ్చిన గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైందని, బీఆర్‌ఎస్‌ను బలమీన పర్చడం కాంగ్రెస్ తరం కాదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. గురువారం సిరిగిరిపురానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు దయ్యాల శ్రీను ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సబిత మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పాలనలో చేసిన పనులేమీ కన్పించడం లేదన్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారెంటీలను అమలుచేసే వరకు కాంగ్రెస్‌ను నిలదీయాలన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడమే కాంగ్రెస్ పాలకులు చేసిన అభివృద్ధి అని విమర్శించారు. గ్రామాల్లో సర్పంచులు లేక ఎక్కడి పనులు అక్కడే నిలిచాయన్నారు. కనీసం పారిశుధ్య నిర్వహణనూ పట్టించుకోవడం లేదన్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేని అసమర్థ స్థితిలో ఉన్న ఈ ప్రభుత్వం మరో నాలుగేండ్లు ఎలా పాలిస్తారని ప్రశ్నించారు. అభివృద్ధి పేరిట నియోజకవర్గ ప్రజలను కొందరు కాంగ్రెస్ నాయకులు ప్రలోభాలకు గురిచేస్తున్నారని, ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజలు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారన్నారు. కార్యక్రమంలో బండ నర్సింహ, శ్రీకాంత్, వెంకటేశ్, శ్రీను, పి.బాలయ్య, జగన్, మహేశ్, టిల్లు, బాబు తదితరులు పాల్గొన్నారు.

చేసేదే చెబుతాం.. చెప్పిందే చేస్తాం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేశంకర్

షాద్‌నగర్, మార్చి20(ఆంధ్రజ్యోతి): 'చేసేదే చెబుతాం.. చెప్పింది చేస్తాం.. ఇది మా ప్రభుత్వ విధానం. విమర్శలకు తావులేకుండా హామీలన్నీ నెరవేరుస్తున్నాం. రిజర్వేషన్ వర్గీకరణతో మాదిగలను రారాజులను చేశాం. 42శాతం రిజర్వేషన్‌తో బీసీలకు పెద్దపీట వేశాం. మాటకు కట్టుబడి ఉన్నాం. గత పాలకుల మాదిరి చెప్పేదొకటి.. చేసేదొకటి ఉండదు.' అని గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ తమ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోంటే ఓర్వలేని కొందరు విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ తీర్మాన ఘనత ఎవరిదో విపక్షాలు చెప్పాలన్నారు. కాంగ్రెస్ పాలనలో మాదిగలకు మంచి రోజులొచ్చాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించి ప్రభుత్వంలోకి వచ్చి అమలుకు నిర్ణయం తీసుకుందని, ఈ బిల్లును పార్లమెంట్ ఆమోదిస్తే బీసీల బతుకులు మారతాయన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి నిధులను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారన్నారు. దశాబ్ద కాలంగా అసంపూర్తిగా ఉన్న ఘనీకృత పశువీర్య ఉత్పత్తి కేంద్రానికి రూ.21.6కోట్లు కేటాయించి పాడి రైతులకు తోడ్పాటందిస్తామన్నారు. దళితుడిని సీఎం చేస్తానన్న కేసీఆర్ ఎంత మాటకారో? చిత్తశుద్ధి ఏమిటో దళితులు గుర్తించాలన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభను బహిష్కరించిన నిర్వాసితులు

- హైవే విస్తరణను తూంకుంటలో 100 మీటర్లకు కుదించాలని ఆందోళన



తూంకుంటలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శామీర్‌పేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గ్రామ సభకు జిల్లా అధికారులు ఆలస్యంగా రావడంతో భూ నిర్వాసితులు బహిష్కరించారు. దీంతో అధికారులు గ్రామసభను వాయిదా వేశారు. రాజీవ్ రహదారిని జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకై ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం తూంకుంటలో జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్, హెచ్ఎండీఏ ఓఎస్డీ మనోహర్ నిర్వాసితులకు పరిహారం, పునరావాసంపై గ్రామసభ తలపెట్టారు. ఉదయం 10:30గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద సభ నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, అధికారి శంకర్‌కుమార్‌లు రాకపోవడంతో ప్రజలు మధ్యాహ్నం 12:30గంటల వరకు వేచి చూసి సభను బహిష్కరిస్తున్నట్లు చెప్పి వెళ్లిపోయారు. కాగా గ్రామస్తులు వెళ్లిన తరువాత మధ్యాహ్నం 12:39 సమయంలో అధికారులు గ్రామసభకు వచ్చారు. మళ్లీ రావల్సిందిగా అధికారులు, తహసీల్దార్ యాదగిరిరెడ్డి గ్రామస్తులను కోరాని వారు రాలేదు. దీంతో గ్రామ సభను ఈ నెల 28న ఉదయం 10:30గంటలకు నిర్వహిస్తామని, అధికారులు ప్రకటించి వెళ్లిపోయారు. ఇదిలా ఉంటే కాగా గ్రామ సభను బహిష్కరించిన అనంతరం భూ బాధితుల అసోసియేషన్ అధ్యక్షుడు కాసుల సుభాష్ ఆధ్వర్యంలో భూ నిర్వాసితులు తూంకుంట రాజీవ్‌రహదారి వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ప్రభుత్వం ప్రకటించినట్లు రాజీవ్‌రహదారి విస్తరణకు 200 మీటర్ల స్థలం సేకరణ కాకుండా 100 మీటర్ల మేరకు మాత్రమే భూ సేకరణ చేయాలని భూ నిర్వాసితులు ఆందోళన చేశారు. 200 మీటర్ల వరకు భూ సేకరణ చేస్తే పెద్ద ఎత్తున ఇండ్లు, ఇళ్ళ స్థలాలను దారుణంగా కోల్పోతున్నామని భూ బాధితులు, మహిళలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు.

పట్టణాల్లో 'ఇందిరమ్మ ఇళ్ల'కు అడుగులు



తాండూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణాలకు అధికారులు ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటికే దరఖాస్తులను పరిశీలించారు. గురువారం గృహనిర్మాణ శాఖ తాండూరు డివిజన్ డీఈ, ఏఈలు మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. యాప్‌లో నమోదు చేసిన వారిలో అర్హులను గుర్తించాలని సూచించారు. వారం రోజుల్లో గృహ నిర్మాణ శాఖ అధికారులు కార్యాచరణ చేపట్టనున్నారు. తాండూరు మున్సిపాలిటీలో 600 మంది వరకు ఖాళీ స్థలాలున్నట్టు గుర్తించారు. ఇప్పటికే గ్రామాల్లో గ్రౌండింగ్ ప్రారంభమైంది.

పరిహారమివ్వకుండానే భూసేకరణ

కందుకూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీల పేరుతో ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల భూములు లాక్కొని నట్టేటముంచుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం రాచులూరు, గాజులబుర్జు తండాల్లో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కంటే సీఎం రేవంత్‌రెడ్డి రెండు రెట్లు అధికంగా రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 25, 26న ఆకులమైలారం నుంచి అన్నోజిగూడ, మీర్కాన్‌పేట, బేగరికంచ, సాయిరెడ్డిగూడ, యాచారం మండలం కుర్మిద్ద, మేడిపల్లి, నానక్‌నగర్ వరకు బాధిత రైతులను చైతన్యపర్చేందుకు జీపుజాత నిర్వహిస్తామని తెలిపారు. 27న కందుకూరు, యాచారం మండలాల్లోని రైతులతో కలిసి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేస్తామని యాదయ్య తెలిపారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.రాంచందర్, కవిత, జగన్, మధుసూదన్‌రెడ్డి, బాల్‌రాజ్, చందు, నరసింహ, శ్రీశైలం, కృష్ణ నర్సింహ, బి.శ్రీనివాస్ ఉన్నారు.

ఇళ్ల పట్టాలిచ్చేవరకూ పోరాటం

చేవెళ్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో గుడిసెలేసుకున్న వారికి ప్రభుత్వం వెంటనే ఇళ్లపట్టాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. గురువారం చేవెళ్లలో పేదలతో కలిసి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ... చేవెళ్లలోని 75సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిలో పేదలు రెండేళ్లుగా గుడిసెల్లో ఉంటున్నారని చెప్పారు. వారికి అదే జాగలో పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ హామీ మేరకు ప్రతీ పేదమహిళకు నెలనెలా రూ.2,500 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి,రామస్వామి, ప్రభులింగం, సత్తిరెడ్డి, శ్రీనివాస్, జంగయ్య, సుధీర్, వడ్ల సత్యనారాయణచారి, అంజయ్య, శివ, గోపాల్‌రెడ్డి, జలీల్, మక్బూల్, రమాదేవి, సుగుణమ్మ, పెంటయ్య, జయమ్మ, భాగ్యమ్మ, యాదమ్మ, ఎలీషా, బీరప్ప, సత్యనారాయణ, శ్రీకాంత్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి పకడ్బందీ చర్యలు



మొయినాబాద్ కమిషనర్ ఖాజా మొయిజ్

ఫటా ఫట్

మొయినాబాద్ రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎనిమిది గ్రామపంచాయతీలు 27 వేల జనాభా.. 50కి పైగా కాలనీలు, ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. పాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం మొయినాబాద్ కేంద్రంగా మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. దాంతో ఇటీవల మున్సిపల్ కమిషనర్‌గా మహ్మద్ ఖాజా మొయిజ్ బాధ్యతలు చేపట్టారు. అభివృద్ధి విషయంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న: మున్సిపాలిటీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాం. పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం.

ప్ర: ఇప్పటి వరకు నిధులు ఏమైనా వచ్చాయా?

జ: ఇప్పటివరకు నిధులు రాలేదు. ప్రతిపాదనలు పంపాం. వచ్చిన వెంటనే మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం.

ప్ర: కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య, పారిశుధ్య తీవ్రంగా ఉంది. ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జ: గ్రామాలను సందర్శించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ప్రధాన సమస్యలు మా దృష్టికి వచ్చాయి. వాటిని త్వరలోనే పరిష్కరిస్తాం.

ప్ర: పన్నులు ఎంత వరకు వసూలు చేశారు?

జ: బకాయిలు దాదాపు రూ.2 కోట్ల వరకు ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.40 లక్షల వరకు వసూలు చేశాం.

ప్ర : వేసవిలో నీటి ఎద్దడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక కార్యచరణ రూపొందించాం. సిబ్బందికి అవగాహన కల్పించాం.

మాడ్గులలో సీహెచ్‌సీ ఏర్పాటుకు ఉత్తర్వులు

మాడ్గుల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీహెచ్‌సీ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ అయ్యాయని, రూ.13కోట్ల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మాజీ సర్పంచ్ యాదయ్యగౌడ్ గురువారం తెలిపారు. మాడ్గుల మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఏర్పాటై దాదాపు 30 ఏళ్లవుతోందని, జనాభా పెరుగుదల, అసౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్‌రెడ్డి సీహెచ్‌సీ మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాడ్గుల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వాటర్ ట్యాంక్ పనులకు మోక్షం

- స్లాబ్ నిర్మాణానికి శ్రీకారం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ట్యాంకు స్లాబ్‌ను కూలుస్తున్న కూలీ, శకలాలు తొలగిస్తున్న కూలీలు

కేశంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు స్లాబ్ కూలిపోయినా అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీటి సమస్య ఎదురైంది. దాంతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన అధికారులు వాటర్ ట్యాంకు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. వివరాల్లోకి వెళితే.. కేశంపేట మండలం సంగెం గ్రామంలో చాలాకాలం క్రితం గ్రామానికి నీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంక్ స్లాబ్ కూలిపోయింది. దాంతో ట్యాంకులోని నీటిని గమనించకుండా ప్రజలకు సరఫరా చేసేవారు. నీటి లో చెత్తా, చెదారంతో పాటు పురుగులు రావడం తో ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు ట్యాంకును పరిశీలించగా కొంత భాగం స్లాబ్ కూలిపోయిన విషయం గుర్తించారు. మిషన్ భగీరథ నీటిని వాటర్ ట్యాంకులోకి ఎక్కించకుండా నేరుగా నల్లాలకు కలిపారు. ఇలా చేయడంతో చాలా ఇళ్లకు తాగునీరు సరఫరా కాలేదు. ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం మార్చి 2న 'ఆంధ్రజ్యోతి'లో భగీరథ.. ఏమిటీ వ్యథ పేరిట కథనం ప్రచురితమైంది. సమస్యను గుర్తించిన అధికారులు వాటర్ ట్యాంకులోకి నీటిని ఎక్కించి గ్రామానికి నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. కూలిన వాటర్ ట్యాంకు స్లాబ్‌కు మరమ్మతులకు నాలుగు రోజుల క్రితం శ్రీకారం చుట్టారు. స్లాబ్‌ను కూలగొట్టి.. దాని స్థానంలో నూతనంగా వేస్తున్నారు. వారంలో ట్యాంకు ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు మిషన్ భగీరథ ఏఈ నాగమణి తెలిపారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

యాచారం/మహేశ్వరం/కందుకూరు/రంగారెడ్డి అర్బన్/చౌదరిగూడ/కేశంపేట/కొత్తూర్/మొయినాబాద్ రూరల్/షాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని యాచారం ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం యాచారం, నందివనపర్తి ఉన్నత పాఠశాలలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మండలంలో ఐదు కేంద్రాలలో 897మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. మహేశ్వరం మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి మొత్తం 1304 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని విద్యాధికారి కస్నానాయక్ తెలిపారు. కందుకూరు మండల విద్యాధికారి హెచ్ నర్సింహ నేదునూరు, మండల కేంద్రం, కందుకూరులోని కేంద్రాలను తనిఖీ చేశారు. 11 జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 778 విద్యార్థులు, ప్రైవేటు స్కూళ్ల నుంచి 124మంది మొత్తం 915మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. నందిగామ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలంలో మొత్తం 215 విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఏంఈవో శ్రీనివాస్ తెలిపారు. చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్ మండల పరిధిలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మండల పరిధిలోని జడ్పీహెచ్‌ఎస్‌లో 163, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 259 మంది పరీక్షలు రాయనున్నారని పరీక్ష నిర్వాహకులు శంకర్ గౌడ్, గోపీనాథ్ తెలిపారు. కాగా, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతించాలని కేశంపేట మండల ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ సూచించారు. కేశంపేట జడ్పీహెచ్‌ఎస్‌లో ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. కొత్తూర్ మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో 2సెంటర్లు, మాంటిస్సోరి పాఠశాలలో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేశామని, మూడు సెంటర్లలో 562మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఎంఈవో అంగోర్‌నాయక్ తెలిపారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, కమిషనర్ బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మొయినాబాద్ మండలంలో మొత్తం ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 1399 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు మొయినాబాద్ మండల ఇన్‌చార్జి ఎంఈవో వెంకటయ్య చెప్పారు. షాబాద్ ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఎంపీడీవో అపర్ణలు మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాలను డీటీ మధుతో కలిసి పరిశీలించారు. ఈమేరకు 12 ఉన్నత పాఠశాలలకు చెందిన 748 మంది పరీక్షలు రాయనున్నారు.

క్రైం కార్నర్

సురసముద్రం చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఆమనగల్లు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు సురసముద్రం చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. చెరువు అలుగు సమీపంలో గురువారం ఉదయం మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మున్సిపాలిటీ, పోలీస్ సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు 30-35 ఏళ్ల వయస్సు కల్గి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై కాఫీ కలర్ షర్టు, జీన్స్ ప్యాంటు ఉంది. యువకుడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆచూకీ తెలిస్తే ఆమనగల్లు సీఐ కార్యాలయం ఫోన్ నెంబర్-9440795749, పోలీస్‌స్టేషన్-8712663339, ఎస్సై-8712663340 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండల పరిధిలో జరిగింది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. పెద్దగోల్కొండకు చెందిన సూరంపల్లి సత్యమ్మ ఈ నెల 19న కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికారు. అయితే, ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని 2023 నుంచి ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుమారుడు ఈశ్వరయ్య తెలిపాడు. గురువారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేశంపేట మండలం సంగెంలో వృద్ధురాలు..

కేశంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సంగెంకు చెందిన ఓ వృద్ధురాలు అదృశ్యమైనట్లు సీఐ నరహరి చెప్పారు. గ్రామానికి చెందిన బ్యాగరి బచ్చమ్మ(65) ఈనెల 17న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పదేళ్లుగా మూర్ఛతో బాధపడటంతో పాటు, మతిమరుపు కూడా ఉన్నట్లు సీఐ తెలిపారు. ఆమె ముఖ కవలికలు చామనఛాయ రంగు, ఐదు ఫీట్ల ఎత్తు, ఇంట్లో నుంచి వెళ్లేముందు పసుపు రంగు చీర, ఎరుపు రంగు బ్లౌజ్ ధరించి ఉందని.. ఈమేరకు ఆమె కుమారుడు శేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

కుమారుడు, కూతురితో కలిసి మహిళ..

శంషాబాద్ రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కుమారుడు, కూతురితో కలిసి ఓ మహిళ అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. చిన్న గొల్లపల్లికి చెందిన చింతమోని మల్లేశ్ ఈ నెల 19న పని కోసం తొండుపల్లికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులతో చెప్పి వెళ్లిపోయాడు. భార్య చింతమోని భవాని, తన కుమారుడు లవ్‌కేశ్ సరిగ్గా చదవడం లేదని మందలించింది. ఈ విషయాన్ని మల్లేశ్‌కు అతడి సోదరుడు రమేశ్ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. దాంతో మల్లేశ్ భార్యను ఫోన్ చేసి మందలించాడు. ఈ క్రమంలో భవాని, కుమారుడు లవ్‌కేశ్, 11 నెలల కుమార్తెతో కలిసి ఇంటి నుంచి బయలకు వెళ్లిపోయింది. గురువారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మల్లేశ్ ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భూసేకరణపై రగడ!

(5వ పేజీ తరువాయి)

అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించారు. అంతటితో ఆగకుండా ప్రస్తుతం మండలంలో మరో ప్రాజెక్టు కోసమని భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొండిగౌరెల్లిలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు భూసేకరణ చేపట్టాలని నోటిఫికేషన్ విడుదల చేయడంపై యాచారం మండల రైతులు భగ్గుమంటున్నారు.

నాడు ఫార్మాసిటీ కోసం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం 8 వేల ఎకరాలను సేకరించింది. ఇందులో 4వేల పట్టా భూమి ఉండగా, 4వేల అసైన్డ్ భూమి ఉంది. మరి కొందరు రైతులు భూములు ఇవ్వడానికి అంగీకరించకపోవడంతో మరో 2200 ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టారు. ఈ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఇప్పటికీ ఆందోళనలు చేస్తున్నారు. అయినా గత, ప్రస్తుత ప్రభుత్వాలు పట్టించుకోలేదు.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం..

ఇదిలా ఉండగానే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసమని మరోమారు యాచారం మండలంలో 144 ఎకరాల వ్యవసాయ భూములను సేకరించాలని నిర్ణయించింది. అధికారులు భూసర్వే చేపట్టారు. ఇప్పటికే హద్దులను గుర్తించారు. భూసేకరణ చేపట్టొద్దని రైతులు హద్దులను తొలగించారు. మా భూముల జోలికి రావొద్దని కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలను ముట్టడించారు. అయినా ప్రభుత్వం రైతుల గోడును పట్టించుకోవడం లేదు. అయినా రైతులు తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

పారిశ్రామిక పార్కు ఏర్పాటు..

ఇప్పటికే యాచారం మండలంలో ఫార్మాసిటీకి, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి వ్యవసాయ భూములు కోల్పోతున్నామని ఆవేదనలో ఉన్న రైతులపై మరో పిడుగు పడింది. మండలంలోని మొండిగౌరెల్లిలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి కోసం పట్టా భూములు 144 ఎకరాల రెండు గుంటలు, అసైన్డ్ భూములు 678 ఎకరాల 9గుంటల భూమిని మొత్తం 821ఎకరాల 11గుంటల భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. భూసేకరణకు కలెక్టర్ నారాయణ రెడ్డి నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుతం ఈ భూములన్నీ సాగులో ఉన్నాయి, సెంటు భూమి కూడా ఖాళీగా లేదు. ఈ భూముల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ రైతులు జీవనం సాగిస్తున్నారు. జీవనాధారమైన ఈ పంటలను లాక్కుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధిలో వెనుకబడిన యాచారం మండలంలోని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని కోరితే ఏకంగా ఉన్న భూములకు ప్రభుత్వం ఎసరు పెట్టిందని రైతులు, కూలీలు ఆవేదన చెందుతున్నారు.

27, 28 తేదీలలో సీపీఎం పాదయాత్ర

నిషేధిత జాబితాలో ఉన్న భూములకు విముక్తి కల్పించడంతో పాటు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం, పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు భూసేకరణ చేపట్టొద్దని డిమాండ్ చేస్తూ ఈనెల 27,28 తేదీల్లో పాదయాత్ర చేపట్టాలని సీపీఎం నాయకులు నిర్ణయించారు. కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి గ్రామాల మీదుగా యాచారం గున్‌గల్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఈ పాదయాత్ర చేయడానికి ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రారంభిస్తారని పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ్మ తెలిపారు.

మా ప్రాణాలు పోయినా భూములివ్వం



ప్రభుత్వం మా భూముల జోలికి రావొద్దు. మా ప్రాణాలు పోయినా లెక్క చేయం. మేం ఏళ్లతరబడిగా నమ్ముకున్న భూములను పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం ఇచ్చేది లేదు. వ్యవసాయం చేయకుండా భూములను పరిశ్రమలకు ఇచ్చి డబ్బులు తింటామా. బలవంతంగా భూములు తీసుకుంటే మరో లగచర్ల ఘటన పునరావృతం అవుతుంది. భూసేకరణ ఆపకపోతే పోరాటం ఆపేది లేదు.

- మేకల యాదగిరి రెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

చావాలా.. బతకాలా..?



ప్రభుత్వం భూములు తీసుకుంటే మేం చావాలో.. బతకాలో అర్థమైత లేదు. నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. మొత్తం తీసుకుంటున్నారు. మాకున్న ఆధారం పోతేం ఏం చేసి బతకాలి. ఈ భూమిపై రెండు కుటుంబాలు ఆధారపడి ఉన్నాయనే విషయం అధికారులు గమనించాలి. బలవంతంగా భూములు తీసుకుంటే పోరాటం చేస్తాం. కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు మా గ్రామం సందర్శించి మా గోడు వినండి. మమ్మల్ని జైలుకు పంపినా.. ప్రాణం తీసినా లెక్క చేయం. నమ్ముకున్న భూములను మాత్రం ఇచ్చేదిలేదు.

- తాండ్ర రవీందర్, రైతు, మొండిగౌరెల్లి

పారిశ్రామిక పార్క్‌కు భూములు తీసుకోవద్దు



మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

యాచారం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు వ్యవసాయ భూములు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని యాచారం మండలంలోని మొండిగౌరెల్లి రైతులు కోరారు. ఈ నేపథ్యంలో గురువారం రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలకు వారు వినతిపత్రాలను సమర్పించారు. పరిశ్రమ ఏర్పాటుకు ఏకంగా 821ఎకరాల 20 గుంటల భూములు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేస్తే తామెలా బతకాలని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమాలలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, నాయకులు మేకల యాదగిరి రెడ్డి, శ్రీనివాస్‌గుప్త, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, నాయకులు బి.కృష్ణ, యాదయ్య తదితరులున్నారు.

పాల వెల్లువ!

(5వ పేజీ తరువాయి)

అనంతరం పనులను ప్రారంభించారు. దశల వారీగా విడుదల చేసిన నిధులతో పశువులకు సంబంధించిన షెడ్లు, గడ్డి పెంచడానికి బోర్లు, ఉద్యోగుల కోసం క్వార్టర్స్‌లను నిర్మించారు. సరిపడా నిధులు విడుదల చేయకపోవడంతో సదరు కాంట్రాక్టరు పనులను అర్థంతరంగా ఆపేశాడు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క, పశుసంవర్థక శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను గుర్తించి ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

పాడి రైతులకు ఉపయోగాలు ఇలా..

ఘనీకృత పశు వీర్య ఉత్పత్తి కేంద్రం నుంచి నాణ్యమైన పాడి ఆవులు, గేదెలను పెంపొందించేందుకు ఇతర జాతీయ స్థాయిలో ఉన్న మంచి ఆరోగ్యం, దృఢత్వంతో ఉన్న లేగ దూడలను కొనుగోలు చేసి ఈ కేంద్రానికి తరలిస్తుంది. ఇక్కడ అవి అనారోగ్యం బారినపడకుండా పోషకాహారాన్ని అందిస్తారు. లేగదూడలు ఎద్దుగా ఎదిగిన తర్వాత వాటి నుంచి సిరంజి ద్వారా వీర్యం సేకరించి లిక్విడ్ నైట్రోజన్‌లో భద్రపరుస్తారు. సేకరించిన స్పెర్మ్‌ను పాడి రైతుల వద్ద ఎదుగుకు వచ్చిన పాడి ఆవులకు ఇంజక్షన్ ద్వారా పంపిస్తారు. దీంతో అవి మేలుజాతి ఆవులు, గేదెలుగా వృద్ధి చెందడంతో పాటు రోజుకు 20లీటర్ల నాణ్యమైన పాలను ఇస్తుంది. వీటికి పుట్టిన దూడలు కూడా మంచి బలిష్టంగా ఉండి వాటి ద్వారా అదేస్థాయిలో పాల ఉత్పత్తి జరుగుతుంది.

ఆచరణలోకి వస్తే అదృష్టమే



ఘనీకృత పశు వీర్య ఉత్పత్తి కేంద్రం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. లక్షల రూపాయలు వెచ్చించి పాడి ఆవులు, గేదెలను కొనుగోలు చేయాల్సిన బాధ తప్పుతుంది. వీర్య ఉత్పత్తి కేంద్రం ద్వారా పాల ఉత్పత్తి కూడా పెరుగుతుంది. ప్రస్తుతం తాము కొనుగోలు చేసిన ఆవులు, గేదెలు రోజుకు 10లీటర్ల పాలను మాత్రమే ఇస్తుంది. పశు వీర్య ఉత్పత్తి ద్వారా వచ్చే ఆవులు, గేదేలు మంచి సామర్థ్యంతో ఉండటం వల్ల రోజుకు 20లీటర్ల మేర పాలు ఇస్తాయి. కంసాన్‌పల్లిలోని పశు వీర్య ఉత్పత్తికి నిధులు కేటాయించడానికి కృషి చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు.

- మహేందర్‌రెడ్డి, కక్కులూరు
పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు

బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి

ఇబ్రహీంపట్నం/కేశంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కార్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.57 శాతం నిధులు కేటాయించిందంటూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో గురువారం బడ్జెట్ ప్రతులను తగులబెట్టారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని, గత ఎన్నికల సమయంలో విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి మాటతప్పారంటూ విమర్శలు చేశారు. రాష్ట్రంలో 90 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులున్నారని, వీరంతా స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుతున్నారనే విషయం గుర్తెరగాలన్నారు. యువజన విభాగం, విద్యార్థి నాయకులు చింతకింది వీరేష్, కానుగుల మహేష్, ప్రసాద్, వినోద్, విష్ణు, రవి, ఉదయ్, వంశీ పాల్గొన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రభుత్వం అరకొర నిధులే కేటాయించిందని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ఎం.శివాజీ ఆవేదన వ్యక్తం చేశారు. కేశంపేట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సుధీర్‌రెడ్డిని అరెస్టు చేయాలి

మహేశ్వరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాతానాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసిఅరెస్టు చేయాలని మహేశ్వరం మండల గిరిజన నాయకుడు ఆర్ఎస్ అంద్యానాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మహేశ్వరంలో పలువురు గిరిజన నాయకులతో ఆయన సమావేశమయ్యారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కాసు శ్రీనివాస్‌రెడ్డి, డోకూరు ప్రభాకర్ రెడ్డి, పందెం గుండు లాగుతున్న ఎద్దులు

తలకొండపల్లి, మార్చి20(ఆంధ్రజ్యోతి): మండల పరిధి దేవుని పడకల్ గ్రామంలో గురువారం అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ పోటీలను నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 14 జతల ఎద్దులు పోటీ పడ్డాయి. ప్రథమ బహుమతిగా రూ. 1.20,116 లక్షలు అందజేశారు. ఈ పోటీలను తిలకించడానికి జనం భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ గట్ట కేశవరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ, కాడెమోని శ్రీశైలం, కాసు శ్రీనివాస్‌రెడ్డి, డోకూరు ప్రభాకర్ రెడ్డి, నెట్టుకాడి సాయికుమార్, లట్టుపల్లి రాజ్‌కుమార్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఆరోపణలొద్దు.. అభివృద్ధి చేసుకుందాం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ రవీందర్, నాయకులు

కొత్తూర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆరోపణలు పక్కన పెట్టి కొత్తూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుడాలని స్థానిక మున్సిపల్ వైస్‌ఛైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, సోమ్లునాయక్, ప్రసన్నలతయాదయ్య, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్‌లు అన్నారు. స్థానిక పాపిరస్ పోర్టు రిసార్టులో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్తూర్-జేపీ దర్గా, కొత్తూర్-కుమ్మరిగూడ రోడ్ల నిర్మాణాలను ఓ పద్ధతి ప్రకారం నిర్మించడం లేదని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్మించాలని సూచించారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రోడ్లకు కోట్లాది రుపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి దాదాపు వంద కోట్లు మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే నిరంతరం కృషి చేసి ప్రొసీడింగ్స్ తీసుకరావడం జరిగిందిని, ఎన్నికల కోడ్ దృష్ట్యా పనులు ప్రారంభించడం లేదన్నారు. ఆ ప్రొసీడింగ్స్‌తోనే కాంగ్రెస్ నాయకులు పనులు చేస్తున్నారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేపై ఎటువంటి ఆరోపణలు చేయలేదని, ఎప్పుడు కూడా గౌరవిస్తామన్నారు. ఎవరినీ కించపరిచే విధంగా తాము మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా బీఆర్ఎస్ నాయకులపై లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కలిసిరావడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు బి. దేవేందర్‌యాదవ్, జె. శ్రీను, జోగు బాల్‌రాజ్, తదతరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి : ఎమ్మెల్సీ

చౌదరిగూడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కొందుర్గు మండలం గంగన్నగూడలో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు చేశారు. మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, సింగిల్‌విండో ఛైర్మన్ దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, బంగారు రాములు, రవీందర్‌రెడ్డి, పవన్‌కళ్యాణ్, తదితరులున్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దేవుని పడకల్ శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. చక్రతీర్థం, ద్వాదశ ఆరాధన, ధ్వజరోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్త రాజుకుమార్‌రెడ్డి, ఈవో స్నేహలతలు భక్తులకు విశాల వసతుల ఏర్పాట్లు చేశారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : రావిచెడ్, మక్తమాదారం, మద్దెల కుంటతండా పరిసర ప్రాంతాల్లో కొంతకాలంగా గృహ, వ్యవసాయ వినియోగదారులు ఎదుర్కుంటున్న విద్యుత్‌లో ఓల్టేజీ సమస్యలు తొలగనున్నాయి. రైతుల గృహ వినియోగదారుల విన్నపం మేరకు విద్యుత్ అధికారులు స్పందించారు. రావిచెడ్‌లోని 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో 5 ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్ స్థానంలో గురువారం సాయంత్రం విద్యుత్ శాఖ డివిజనల్ అధికారి గోపాలకృష్ణ, డీఈ భాస్కర్, ఏడీఈ బాల కృష్ణ పర్యవేక్షణలో 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

తలకొండపల్లి : వెల్జాలకు చెందిన శంకరయ్యయాదవ్‌కు ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో రూ.39వేల సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. బాధితుడికి మాజీ ఎంపీటీసీ శ్రీనివాస మూర్తి, ఉపసర్పంచ్ అజీజ్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఎండీ ఆరిఫ్‌లు చెక్కును అందజేశారు.

ఆమనగల్లు : మందకృష్ణ పోరాటఫలితమే ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదమని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తుడుం కిరణ్‌మాదిగ అన్నారు. మూడు దశబ్దాలకు పైగా వర్గీకరణ కోసం రాజీలేని పోరాటాలు కొనసాగించడం జరిగిందన్నారు. ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఏకగ్రీవ ఆమోదాన్ని హర్షిస్తూ సంబురాలు జరుపుకున్నారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు శ్రీశైలంమాదిగ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాదిగ అమర వీరుల చి త్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు.

ఆదిభట్ల : విద్యార్థులు చిన్నప్పటినుంచి కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మంకాల శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మండలం కప్పాడులోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 100 విద్యార్థులకు జయశీల వీరారెడ్డి జ్ఞాపకార్థం 300 నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన వెంకటరామయ్య ఫౌండేషన్ సభ్యులు జేవీ సాగర్‌ను ఆయన అభినందించారు. టీఎస్ యుటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాములయ్య, యువజన నాయకులు సతీష్‌గౌడ్, విఘ్నేష్, ప్రభుదాస్, హెచ్‌ఎం తిరుపతయ్య, టీచర్లు పాల్గొన్నారు.

యాచారం : మహిళలు ప్రముఖ వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి అన్నారు. అమెజాన్ సంస్థ ప్రతినిధులు గురువారం మేడిపల్లి రైతు వేదికలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పలువురు గ్రామ మహిళలను ప్రతినిధులు హేమాద్రి, లత తదితరులు సత్కరించి వారికి ప్రోత్సాహకం కింద నలుగురికి చెక్కులు, జ్ఞాపికలు అందించారు. మేడిపల్లి హెచ్‌ఎం ఉదయశ్రీలున్నారు.

మొయినాబాద్ రూరల్ : చైతన్య డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన రీసెర్చ్ సూపర్‌వైజర్ ప్రొఫెసర్ ఎం.రవీందర్ ఆధ్వర్యంలో కె.స్వప్న కెమిస్ట్రీ విభాగంలో 'యాంటీ క్యాన్సర్ స్క్రీనింగ్ ఆఫ్ న్యూ సబ్‌స్టిట్యూటెడ్ ఫైవ్ మెంబర్డ్ హెటిరోసైక్లిక్ కాంపౌండ్స్'లో పరిశోధన చేయగా డాక్టరేట్ వరించింది. వర్సిటీ డైరెక్టర్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

కేశంపేట : అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు తీర్మానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్ కొనియాడారు. బీసీ రిజరేషన్లు, ఎస్సీ వర్గీకరణ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో సీఎం, ఎమ్మెల్యే శంకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, ఏఎంసీ డైరెక్టర్లు భాస్కర్ గౌడ్, కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కందుకూరు : గూడూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న ఖాళీస్థలంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సహకారంతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు గురువారం భూమిపూజ చేశారు. అనంతరం వారు విద్యార్థులకు క్రీడాసామగ్రిని అందజేశారు.